# "స్త్రీ"

"శోభశ్రీ"

"ఆ అనురాధ ఆనాడే అంతరించింది"

"లేదు.... నా రత్నాలరాశి, అందాల అనూ అంతరించలేదు, చిలకలా కులుకుతూ, నెమలిలా పురివిప్పి నేత్రాలు జిగేల్ మనేలా నృత్యం చేస్తోంది నా ఎదుట!"

"కాదు ... మీ ఎదుట దీనాతిదీనమై అలవరచుకొన్న తప్పిదాన్ని అంతమొందించమంటోంది ..."

"అహాఁ . ?

"అవును !!"

"అనూ! .. ఏదో క్రొత్తగా మాట్లడుతున్నట్లున్నావు ... నా అనూ నేను చెప్పినట్లల్లా చేస్తుందని అందరి ఎదుట గర్వంతో చెప్పుకొంటున్నాను ... ఆ విషయంలో నన్ను చూచి ఈర్ష్య పడనివారు లేరు ... నీ అందం, ఆ చిరునవ్వులో మెదిలే సోయగం .. గలనీవు నాభార్యవవ్వటం.... నీవు నోచిననోములు ఫలించాయి ... నా ఆశలు అత్యుత్తమ స్థాయిని చుంబించాయి ... ఇతరుల కళ్ళల్లో ఎర్రచారలు స్థానమేర్పరుచుకున్నాయి..."

"అవును! ... అందుకే గాబోలు నేను అధఃపాతాళానికి అదిమి వేయబడుతున్నాను ..

"లేదు ... కైలాస పర్వతానికెత్తబడుతున్నావు .. నీ ముందు ఆ పార్వతి .."

"మీ అపవిత్రమైన నోటితో దయామయిని ఉచ్ఛరించకండి!"

"అవును ... అనూ .. అను ... నా నోరు అపవిత్రమైంది ఆ భగవంతుడే నాశరీరాన్ని సహస్రవ్రక్కలయ్యేలా శాపమియ్యలేదు ..."

"ఇచ్చినా బాగనేవుండేది!!"

"ఊఁ.... ఏమన్నావు .. నేను సహస్ర వ్రక్కలవ్వాలని నివ్వే ఆశిస్తున్నావన్నమాట ... నీవుఒక స్త్రీవేనా ... కాదు, కాదు!! నీవొక నరరూపరాక్షసివి-మాయా భయంకరపిశాచివి .. విషకుంభానివి ... చూస్తాను ... నీశరీరంలోని రక్తాన్ని బొట్లుబొట్లుగా రాల్పిస్తాను. ... బయల్దేరు ఊఁ .. నా స్నేహితులు మనకోసరం ఎదురు చూస్తుంటారు ఆక్లబ్బులో నేనులేక పోతే ..."

"నేనురాలేను..."

"రావాలి ..."

"రాలేను . అక్కడికొచ్చి కనబడ్డ మొగాణ్ణల్లా పండ్లికిలిస్తూ పలకరించలేను ..."

"ఇన్నాళ్లు నీవాపని నేలా చేయగలిగావు?"

"మీరు నాకు మసకద్దాలు పెట్టి చీకటి తెరలతో మూశారు. అవి ఇప్పుడిప్పుడే విచ్చుకొని, వెలుతురిని నింపుకుంటున్నాయి!"

"ఆ చీకటి తెరలు నీ జన్మలో తొలగవు— తొలగనీయను."

"తొలగించగలను తొలగించి నా నారీధర్మాన్ని ఋజువు పరుచుకుంటాను ...

"ఋజువు .. పెద్ద పెద్ద మాటలను నేర్చావే .. అందరు చేసుకోలేక నే నా కాలంగడుపు తున్నారు...వాళ్లు ఆ సంతోషంలో సంతోషాన్ని అర్థం చేసుకొన్నారు .... కాబట్టే ఆ పరిసరాలను వదిలిపెట్టకుండా జీవితాలను ధన్యపరచుకుంటున్నారు ...."

"జీవితాలను అర్థాన్న పరచుకుంటున్నారు."

"అది నీ ఊహలో — పద నన్ను విసిగించక, ఆ కొత్తగా తెచ్చిన చీరెను కట్టుకొని, హంసలా అందాన్ని చిందిస్తూ బయిల్దేరు ..."

"నేను రాను—రాను—ఆ ఉల్లిపొరలాంటి చీరను శింగారించుకొని రోడ్డుమీద వింత జంతువులానడవలేను! అలా రావటం మా స్త్రీ జాతికే కళంకం — గొడ్డలిపెట్టు — ఏ భారత యువతి దానినాశించదు... విదేశీ అనుసరణీయులుతప్ప ... వారికిక వచ్చేజన్మలో పుట్టగతులుండవు .. పాపం శమించుగాక! ఇదివరకు నేను చేసిన తప్పిదానికి క్షమించమని భగవంతుని ప్రార్థిస్తున్నాను..."

"క్షమిస్తాడు ... భర్త నెదిరించిన భార్యను క్షమిస్తాడు? మోక్షం చేకూరుస్తాడు? — "నీవేలాగైనాచావు — నాక్కావాల్సిందల్లా నీవా చీరకట్టుకొని క్లబ్బుకు రావాలి ... నాస్నేహితులంతా మనకోసం ముఖ్యంగా ని అందాన్ని చూడాలని ఆశతో చూస్తుంటారు ... వారి భార్యలు నిన్ను చూచినవెంటనే చంద్రుని యెదుట తారకలవలె మొఖాలు వేలాడేస్తూ ఈర్ష్యతో — సిగ్గుతో — నావంక, నీ వంక చూస్తారు ... పద ఈ రోజునుండి క్లబ్బుకి రాణివి నీవు ... రాజుని—??"

"ఎన్నటికి కాదు! వింత అడవిమృగంతో నేను సంచరించలేను."

"ఒహో . పవిత్రమూర్తివి, ఏకపత్నీవ్రతురాలివి గదూ?" అతని హృదయం అద్దంలాంటిది గాబోలు!!"

"తప్పకుండా. మీరెన్నన్నా సహిస్తాను; చంపినా సుఖంగా జీవితాన్ని సమర్పిస్తాను... కాని ఆప్రదేశానికొచ్చి నాశీలాన్ని కలుషితం చేసుకోలేను; మానానికి మలినం

చేకూర్చలేను. రాలేను క్షమించండి !'' గిరుక్కున వెనక్కు తిరిగి గదిలోకిపోయింది.

వదలలేదు భర్త ... పెట్టిన యమ యాతనలను సంతోషంతో సహించింది... కాని ఆతని కోరికను నెరవేర్చలేదు.

తాసిదివరకు భర్త చెప్పినట్లల్లా తిరిగి పరాయిపురుషులతో చేతులు చేతులు కలిపి, పండ్లికిలించినమాట నిజమే' కాని ఇప్పుడు కళ్ళులేనికళ్ళు ప్రపంచపు పోకడను అవగాహన చేసుకుంది ... తనకోసం ఎంత మంది తాపత్రయ పడేది తెలుసుకుంది .... భారత దేశంలోని స్త్రీకిగల ప్రాధాన్యతను గుర్తించింది. స్మరించింది స్వగతంలోనే.

''చేతిలోనున్నది చూచావా ?''

''చూచాను ... కత్తి ... నాకు మోక్షాన్ని ప్రసాదించే దేవత .. చిరు నవ్వుతో కౌగిలించుకోమని మనసారా ప్రొక్కుడుతున్నాను !''

''ఆఁ .... ఆలాకాదు .... నీదిబండ బారిన మొండిగుండె. అన్నం నీళ్లు లేకుండా ఈ గదిలోనే పడిచావు !'' తలుపు తాళం వేసి కోపంతో వెళ్ళిపోయాడు.

అనూరాధ కళ్ళు కాయలు కాచాయి... హృదయం బొబ్బలెక్కింది. మనస్సులోని గాయం మరింతరక్తాన్ని బయటకు చిమ్మింది.

♦ ♦ ♦

మూడురోజుల తరువాత మద్య పానపు మత్తుతో తిరిగివచ్చిన అనురాధ భర్తకు — అనూరాధ ఆగదిలోనే ఉరిపోసుకుమరణించి నదని తెలిసినతరువాత ... కళ్లు తెరిపిళ్లు పడ్డాయి.

''నిజంగా మొదటి అనూరాధ మరణించిందెన్నడో! ఇప్పుడు తన అప్రియమైన రెండవ అనూరాధగూడ అంతరించింది!'' పిచ్చివాడిలా రోడ్లమీద తిరుగుతూ ఏడ్వ సాగాడు.

♦ ♦ ♦

ఆ గృహంలో నిలువెత్తు కృష్ణదేవుడి పఠాని కేసిన చేమంతి పూలదండనుండీ రెండు రేకలు గాలికి ఊడి ఎక్కడికో కొట్టుకుపోయాయి.